ఉచిత వైద్య శిబిరానికి స్పందన



అల్వాల్: వెల్‌నెస్ అండ్ కేన్సర్ స్క్రీనింగ్ జీహెచ్‌ఎంసీ, విశ్వనాథ్ కేన్సర్ కేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అల్వాల్ జీహెచ్‌ఎంసీ వార్డు ఆఫీస్‌లో సోమవారం పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించారు. అల్వాల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి హాజరై పరీక్షల తీరును పరిశీలించారు. ఆరు విధాల కేన్సర్ పరీక్షలు జరిపారు. మగవారికి, ఆడవారికి అవసం మేరకు పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ శ్రీరామ్, డాక్టర్ స్రవంతి, డాక్టర్ మంజుల, డాక్టర్ సాయిమురళి, ఎస్ఎస్ ప్రభాకర్, వార్డు ఆఫీసర్ స్వామి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్ బాలాజీ ఆలయంలో సమీక్ష సమావేశం



అల్వాల్: అల్వాల్ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం వివిధ రకాల శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 17వ తేదీ నుంచి నిర్వహించే బ్రహ్మోత్సవాలు సందర్భంగా పనులపై సమీక్షించారు. ఆలయ వంశపారంపర్య చైర్మన్ రాజాగోపాల్ సెంచర్, ఆలయ ఈవో వీరేశం, మున్సిపల్ సూపరింటెండెంట్ స్వామి, ప్రభుత్వ ఆస్పత్రి డాక్టర్ ప్రసన్నకుమారి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, స్థానిక పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్కేపురం చెరువును సుందరీకరిస్తాం



ఆర్కేపురం చెరువు వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: నేరేడ్‌మెట్ డివిజన్‌లోని ఆర్కేపురం చెరువుని సోమవారం అధికారులతో కలిసి మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి స్థానిక కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. పెండింగ్‌లో పనులు పూర్తిచేసి చెరువు సుందరీకరణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డీసీ రాజు, నీటిపారుదల శాఖ అధికారులు, స్థానిక నాయకులు ఉపేందర్‌రెడ్డి, జీకే హన్మంతరావు, శివ, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, వసంత్, రమేష్, రవీందర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి కృషిచేస్తా



అన్నదానంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: మల్లాపూర్ నందీశ్వరాలయ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కార్తీక మాసం చివరి సోమవారం పురస్కరించుకొని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గడ్డమీది శ్రీహరిగౌడ్, పీజీ సుదర్శన్, పీఆర్.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి



విద్యుత్‌పై అధికారులతో కార్పొరేటర్ శ్రీవాణి వెంకట్‌రావు

రామంతాపూర్: డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు సోమవారం విద్యుత్ విభాగం డీఈ సూర్యనారాయణ, భగాయత్ ఏఈ కిరణ్‌కుమార్, రామంతాపూర్ ఏఈ రాములును విద్యుత్ కార్యాలయంలో కలిసి డివిజన్ పరిధిలో నెలకొన్న పలు విద్యుత్ సమస్యలను వారి దృష్టికి తెచ్చారు. భగాయత్ కాలనీలతో పాటు శ్రీనగర్ కాలనీ, వివేక్‌నగర్‌లలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు సమస్య చాలా రోజుల నుంచి పెండింగ్‌లో ఉందని, అదేవిధంగా ఇందిరానగర్, నెహ్రూనగర్, శారదానగర్ తదితర కాలనీల్లో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, అందుకు తగ్గట్టుగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని ఆమె అధికారులను కోరారు. సానుకూలంగా స్పందించిన అధికారులు సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



మేడిపల్లిలో అయ్యప్ప పడిపూజలో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడిపల్లి: ఆధ్యాత్మిక ఉన్నతి, మానసిక ప్రశాంతతకు దీక్షలు తోడ్పడతాయని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. శ్రీగురు ధర్మశాస్త్ర సేవాసమితి ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ వై.రాజన్ నంబూద్రి గురుస్వామి పర్యవేక్షణలో మేడిపల్లి శ్రీవీరాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో అయ్యప్ప భక్తులు భక్తిశ్రద్ధలతో వైభవోపేతంగా సోమవారం మూల నరేష్ గురుస్వామి నిర్వహించిన అయ్యప్ప స్వామి 18వ మహా పడిపూజ నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మల్లారెడ్డి పాల్గొని స్వామి వారి ఆశీర్వాదాలను పొందారు. మహాపడి పూజలో జంట కార్పొరేషన్లతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

కళ్లు మూసుకున్న అధికారులు..

రెచ్చిపోతున్న కబ్జాదారులు

ఉప్పల్ నల్ల చెరువు శిఖం స్థలం హాంఫట్

- రాత్రి వేళలో లారీలతో మట్టిని నింపుతూ..
- అధికారులకు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఉప్పల్‌వాసులు
- అధికారుల ప్రమేయంతోనే అంటూ ఆరోపణ



ఉప్పల్ నల్ల చెరువులో మట్టితో నింపిన ప్రాంతం

ఉప్పల్: ఉప్పల్ నల్ల చెరువులో కబ్జాల పర్వం యథేచ్ఛగా కొనసాగుతోంది. ఎన్నికల విధుల్లో అధికారులు నిమగ్నమవడంతో కబ్జాదారులకు కలిసొచ్చింది. రూ.కోట్ల విలువైన ప్రభుత్వం స్థలంపై గద్దల్లా వాలిపోయారు. ఉప్పల్ నల్ల చెరువులో గతంలో కూడా అనేక పర్యాయాలు కబ్జాల పర్వంపై స్థానికులు రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసిన సంగతి విధితమే. దీంతో అధికారులు సదరు కబ్జాదారులపై కేసులు నమోదు చేశారు. ఆ విషయం కోర్టు వివాదంలో ఉండగానే కబ్జాదారులు మరో మెట్టు పైకి ఎక్కి చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్ స్థలాలను పూర్తిగా మట్టితో పూడ్చి వేసి అధికారులకు సవాల్ విసురుతున్నారు. రాత్రి వేళలో లారీలతో మట్టి నింపుతున్నా.. రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో కబ్జాదారులు రెచ్చిపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కబ్జాలపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోకపోవడంతో పెద్దఎత్తున అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంపై సోమవారం ఉప్పల్‌వాసులు కొంతమంది నల్ల చెరువును పూడ్చివేస్తున్నారంటూ ఉప్పల్ తహసీల్దార్ వెంకట నర్సింహారెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన తహసీల్దార్ వెంటనే పనులు నిలిపివేయించారు. నల్ల చెరువు కబ్జా పర్వంపై తహసీల్దార్ వెంకట నర్సింహారెడ్డి స్పందిస్తూ వెంటనే విచార చేపట్టామని, మట్టి పోసే వారిపై, కబ్జా చేస్తున్న వారిపై కూడా విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కబ్జా చేసే వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

అభినందనలు



కాప్రా: ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని సోమవారం నాచారం ప్రాంతానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు కలిసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయిజెనోఖర్ తదితరులు ఉన్నారు.

నగరానికి గోల్డెన్ పెవిలియన్

సాక్షి, సిటీబ్యూరో: మూడున్నర దశాబ్దాలుగా విజయవాడ కేంద్రంగా భోజనప్రియులకు సేవలందిస్తున్న గోల్డెన్ పెవిలియన్ రెస్టారెంట్ నగరానికి వచ్చింది. ఈ రెస్టారెంట్‌ను ప్రారంభించిన సందర్భంగా సంస్థ యజమాని సాజిద్ మహమ్మద్ మాట్లాడుతూ నగరవాసులకు వైవిధ్యభరిత రుచులను అందిస్తున్నామని, ఇప్పటికి 80 వరకూ రెస్టారెంట్స్‌ను తమ గ్రూప్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన పలువురు యువ ఫుడ్ బ్లాగర్స్ హాజరై వంటకాలను రుచి చూస్తూ సందడి చేశారు.

వేగంగా అభివృద్ధి చేసుకుందాం

- పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటా..
- కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి



మాట్లాడుతున్న కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి

రామంతాపూర్: కొన్ని సంవత్సరాలుగా ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభివృద్ధికి, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం జెండా మోసి పార్టీ గెలుపు కోసం శ్రమించిన వారికే పార్టీ పదవులు దక్కుతాయని కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఉప్పల్ ఏ బ్లాక్ పరిధిలో పోలైన ఓట్ల శాతంపై ఉప్పల్ భగాయత్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశానికి పరమేశ్వర్‌రెడ్డి హాజరై కార్యకర్తలకు, నేతలకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి, పార్టీ శ్రేణులు తీసుకువెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఉప్పల్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆశీస్సులతో నియోజకవర్గాన్ని మరింత వేగంగా అభివృద్ధి చేసుకుందామని ఆయన పేర్కొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రణయ్‌రాజ్‌కు ప్రథమస్థానం



వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన ప్రణయ్‌రాజ్

బోడుప్పల్: మేడ్చల్ జిల్లా వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ 2023 పోటీల్లో బోడుప్పల్‌కు చెందిన జొన్నపల్లి ప్రణయ్‌రాజ్ ప్రథమ స్థానంలో నిలిచారు. పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో బోడుప్పల్‌లోని ఈ ఫిట్‌నెస్ స్టూడియో జిమ్‌లో పోటీలను నిర్వహించారు. ప్రణయ్‌రాజ్ డెడ్ లిఫ్ట్‌లో 130 కేజీలు, బెంచ్ ప్రెస్‌లో 60 కేజీలను ఎత్తి ఈ విజయం సాధించారు. బోడుప్పల్ ద్వారకానగర్‌లోని స్లిమ్ లయన్ ఫిట్‌నెస్ జిమ్ కోచ్ అశోక్ వద్ద శిక్షణ పొందినట్లు ప్రణయ్‌రాజ్ వెల్లడించారు. ఈ సందర్భంగా కోచ్ అశోక్ మాట్లాడుతూ ఈ ఛాంపియన్‌షిప్ 2023లో విజయం సాధించిన ప్రణయ్‌రాజ్ త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు వెల్లడించారు. కఠోరమైన శిక్షణ, సూచనలు, సలహాలు, మెళకువలతో ఈ విజయం సాధించినట్లు తెలిపారు. కార్య క్రమంలో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా

పీర్జాదిగూడ కౌండిన్య గౌడ సంఘం అధ్యక్షుడు వేముల నాధంగౌడ్



పీర్జాదిగూడ కౌండిన్య గౌడ సంఘం అధ్యక్షుడు వేముల నాధంగౌడ్ తదితరులు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ గౌడ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా వేముల నాధంగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఉప్పల్ డిపో మల్లికార్జుననగర్‌లో జరిగిన కౌండిన్య గౌడ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం కౌండిన్య గౌడ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యులు వేముల కేశవనాధంగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన మాట్లాడుతూ మేడిపల్లి మండలంలోని గౌడ సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని, ఏ ఒక్క గౌడ సభ్యుడికి అన్యాయం జరగకుండా హక్కులను కాపాడే విధంగా తనవంతు బాధ్యత నిర్వర్తిస్తానన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు పలుసం శంకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా రంగ నాగభూషనంగౌడ్, కోటి లక్ష్మణ్, ఎరుకల విజయ్‌కుమార్‌గౌడ్, బత్తుల సత్యనారాయణ, భాస్కర్‌గౌడ్ రమేష్‌గౌడ్ రాజు, శ్రీనివాస్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికలకు సిద్ధం కావాలి

జిల్లా కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: రాబోయే ఎన్నికలకు అధికారులు సిద్ధంగా ఉన్నారని, ఈ విషయంలో వారితో సమీక్ష సమావేశాలు నిర్వహించి ఎన్నికల విధులపై అప్రమత్తం చేస్తున్నామని జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పకుండా పాటిస్తూ అధికారులకు అవసరమైన ఆదేశాలు జారీ చేస్తున్నామన్నారు. ఓటరు జాబితాను మరోసారి సమగ్రంగా పరిశీలిస్తామన్నారు. తొలగించిన ఓటర్ల వివరాలు సమగ్రంగా ఇంటింటి సర్వే చేపట్టి పరిశీలిస్తామన్నారు. డూప్లికేట్ ఓటర్లు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అర్హులైన ఏ ఒక్కరి పేరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. ఆయా కారణాల వల్ల ఓటర్ల జాబితా నుంచి తొలగించిన పేర్లను మరోమారు పరిశీలించి, పోలింగ్ స్టేషన్ వారీగా క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, అర్హులైన వారికి ఓటు హక్కు కల్పిస్తామని పేర్కొన్నారు. అనంతరం సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ఎన్నికల ను ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు ఇప్పటి నుంచే ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్లాలని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, ఈఆర్వోలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ



కాప్రా: సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ సీఎం కేసీఆర్‌ను సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



కుషాయిగూడ: కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. సుమారు 55 సంవత్సరాల వయసు గల వ్యక్తి కుషాయిగూడలోని శ్రీపద్మావతి వెంకటేశ్వరస్వామి ఆలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో పడి ఉన్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. విగతజీవిగా పడిఉన్న వ్యక్తిని పరిశీలించగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడికి సంబంధించిన వారు ఉంటే కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఆశ్రయించాలని ఎస్ఐ వెంకన్న కోరారు.

చలికి తట్టుకోలేక యాచకురాలు మృతి

ఉప్పల్: గుర్తు తెలియని యాచకురాలు మృతి చెందిన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గుర్తు తెలియని యాచకురాలు(55) ఉప్పల్ డీఎస్ఎల్ మాల్ పరసర ప్రాంతంలో పడి ఉండటాన్ని గమనించిన స్థానికులు 100 డైల్ చేసి సమాచారం అందించారు. ఉప్పల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారించగా యాచకురాలు అని నిర్ధారించారు. చలి తీవ్రతకు తట్టుకోలేక మృతి చెందినట్లు అనుమానించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఘట్‌కేసర్: ఇయర్ ఫోన్ పెట్టుకొని మాట్లాడుకుంటూ రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం సాయంత్రం జరిగింది. స్థానికులు, రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇయర్ ఫోన్ పెట్టుకొని మాట్లాడుకుంటూ ఘట్‌కేసర్ రైల్వే గేటు దాటుతుండగా నాంపల్లి నుంచి విశాఖపట్నం వెళ్తున్న గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మరణించాడు. అతడి శరీరం నుజ్జునుజ్జయ్యి సుమారు 100 మీటర్లు దూరంలో శరీర భాగాలు పడ్డాయి. రైల్వే సిబ్బంది సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: గౌడవెల్లి సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా పలు గ్రామాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏఈ పవన్‌చందు తెలిపారు. గౌడవెల్లి, బాసిరేగడి, జ్ఞానాపూర్ గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు అన్ని రకాల సర్వీసులకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

ప్రజా అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజావాణిలో ప్రజలందించే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని, దీంతో ఫిర్యాదుదారులకు మేలు కలుగుతుందని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ పి.గౌతమ్ తెలిపారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులు పరిష్కారం అయ్యింది.. లేనిది వారికి స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యలపై ప్రజలు అందించిన 53 ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. ప్రజా అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ.. వాటిని పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. పరిష్కరించిన అర్జీల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంతో పాటు వారికి సమాచారం అందించాలని సూచించారు. ప్రజావాణి ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి, వాటి పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇంటి మెయిన్ డోర్‌పగులగొట్టి చోరీ

ఘట్‌కేసర్: బంధువుల వివాహానికి వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంట్లో చోరీ జరిగిన ఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. సబ్ ఇన్‌స్పెక్టర్ రాముునాయక్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ మేడిపాటినగర్‌కు చెందిన మెరుగు సురేశ్ ఈ నెల 6న యాదాద్రి జిల్లా బీబీనగర్ మండలం జైనపల్లి గ్రామంలోని బంధువుల వివాహానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. తిరిగి సోమవారం ఉదయం ఇంటికి వచ్చేసరికి ఇంటి మెయిన్ డోర్ పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా అల్మారాలో దాచిన 20 గ్రాముల బంగారు నల్లపూసల దండ, సుమారు రూ.30 వేల నగదు కనిపించలేదు. దీంతో గుర్తు తెలియని దుండగులు డోర్ పగులగొట్టి సొత్తు, నగదు ఎత్తికెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆశీర్వచనం



చిన్నారిని ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి ద్వితీయ కుమార్తె శారీ ఫంక్షన్ వేడుకలను సోమవారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ శ్రీఫణి కన్వెన్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి హాజరై చిన్నారి వినూత్నను ఆశీర్వదించారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, పట్టణ పెద్దలు, రాజకీయ నాయకులు తదితరులు హాజరై ఆశీర్వదించారు.

ఘనంగా కార్తీకమాసం పూజలు



ఉత్తంనగర్ దుర్గా జ్యోతిషాలయంలో హోమం నిర్వహిస్తున్న మూగు నాగరాజుశర్మ

గౌతంనగర్: కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా గౌతంనగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మల్లికార్జునగర్ మల్లన్న దేవాలయంలో స్వామివారికి పూజలు నిర్వహించారు. ఉత్తంనగర్‌లోని దుర్గా జ్యోతిషాలయంలో రుద్రహోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.